క్లుప్తంగా

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కోనరావుపేట: మండలకేంద్రంలోని రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పంటలకు మోతాదులో యూరియా ఉపయోగించడం, పచ్చిరొట్ట ఎరువులు, వర్మీ కంపోస్ట్, పశువుల ఎరువు వాడటం, సాగునీటి యాజమాన్యం, కూరగాయల సాగు, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.జె.రాజేందర్, డా.హిందూజ. ఏడీఏ రామారావు, మండల వ్యవసాయ అధికారి పి. సందీప్, మండల ఉద్యాన అధికారి సీహెచ్. లోకేష్, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మ్యాకల ప్రభాకర్, మాందాల లింబయ్య, ఏఈవోలు జె. రమేష్, ఎ.సహజ, బి.హేమాజీ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు

ముస్తాబాద్: దేశ రక్షణ కోసం సైనికులు బాగుండాలని కోరుతూ మండలంలోని గూడెం హనుమాన్ ఆలయంలో గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు రామశర్మ, శ్రావణ్‌శర్మ ఆధ్వర్యంలో మన్యసూక్త రుద్రహోమం నిర్వహించారు. హనుమాన్ దీక్షాపరులు పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు నాగేంద్రశర్మ, సాత్విక్ శర్మ, చిట్నేని వెంకటేశ్వర్‌రావు, అంజన్‌రావు, శ్రీనివాస్‌రావు, మల్లేశ్, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



బోయినపల్లి : మండలంలోని తడగొండలో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం జరిగిన స్వామివారి రథోత్సవంతో వైభవంగా ముగిశాయి. వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఉదయం రథంపై ఊరేగించారు. స్వామివారి రథం లాగేందుకు యువకులు, మహిళలు, పిల్లలు అందరూ పోటీపడ్డారు. రథంపై ఉన్న స్వామి వారికి భక్తులు టెంకాయలతో నైవేద్యం సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. బొమ్మెన రాధాకిషన్‌రావు, పూజారులు లింగన్నపేట అశోక్ ఆచార్య, శాత్రాజ్‌పల్లి హరికృష్ణ ఆచార్య, సాయి శర్మలు పూర్ణాహుతి హోమం నిర్వహించారు. నాగవెల్లి కన్నులపండువగా జరిగింది.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం


పూజలు చేస్తున్న తోట ఆగయ్య, కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్‌లోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీరేణుకా ఎల్లమ్మ సిద్ధోగం వేడుకల్లో భాగంగా మంగళవారం రేణుకా ఎల్లమ్మ- జమదగ్నిల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ఎల్లమ్మ పట్నాలు, నాగెల్లి(పెద్ద పట్నం) వేశారు. అనంతరం సిద్దులు తిరుగుట, ఒడిబియ్యం, సమర్పించే కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. అమ్మవారిని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కొండ రమేష్‌గౌడ్, అందే సుభాష్, మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, గౌడ సంఘం ప్రతినిధులు దర్శించుకుని పూజలు చేశారు.

చెత్త తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..

గంభీరావుపేట: గంభీరావుపేట మండలకేంద్రం నుంచి నర్మాల గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఆనుకొని చెత్తాచెదారం పేరుకుపోతుందని సాక్షిలో ప్రచురితమైన ఫొటో కథనానికి గ్రామపంచాయతీ అధికారులు స్పందించారు. మంగళవారం పారిశుద్ధ్య కార్మికులతో చెత్తచెదారాన్ని తొలగించారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీని ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని ఇల్లంతకుంట గ్రామపంచాయతీ కార్యదర్శి సుంకపాక వరుణ్‌కుమార్ సోమవారం సెస్ ఏఈ నగేశ్‌కుమార్‌కు నోటీస్ అందజేశారు. ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సెస్ ఏఈ నగేశ్‌కుమార్‌ను వివరణ కోరగా పాఠశాల పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను త్వరలో తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు.

భక్తి పరిమళాలు

- గంభీరావుపేట రామాలయంలో చిన్నారులకు శ్లోకాలపై శిక్షణ
- ఆధ్యాత్మికతతోపాటు మానసిక ప్రశాంతత


గంభీరావుపేట రామాలయంలో విద్యార్థులకు శ్లోకాలు నేర్పిస్తున్న టీచర్

గంభీరావుపేట: ఆధ్యాత్మికతో మానసిక ప్రశాంతత కలుగుతుంది. మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు చేసే పనిలో విజయం లభిస్తుంది. ఆధ్యాత్మికతతో సమాజం కూడా అభ్యున్నతి చెందుతుంది. ఇలా.. ఆధ్యాత్మికత గొప్పదనాన్ని గుర్తించి విద్యార్థులను భక్తిమార్గంలో నడిపించాలని వేసవి సెలవుల్లో శ్లోకాలపై శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గంభీరావుపేట మండలకేంద్రంలోని శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలో చిన్నారులకు శ్లోకాలపై ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నారు. పదుల సంఖ్యలో విద్యార్థులు హాజరై హనుమాన్ చాలీసా, శ్లోకాలు నేర్చుకుంటున్నారు. గంభీరావుపేట ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు. 700 ఏళ్ల చరిత్ర గల రామాలయం. ఎవరి నోట విన్నా.. రామాలయం చరిత్ర తెలుస్తుంది. ఆలయంలో నిత్యం దైవనామస్మరణ చేస్తుంటారు. విష్ణు సహస్ర నామ పారాయణంతో పాటు భగవద్గీత, హనుమాన్ చాలీసా, భక్తి పాటలు ఆలయంలో వినిపిస్తుంటాయి. వేసవిలో విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఎండలో ఆటలు ఆడి అనారోగ్యం బారినపడకుండా.. సంస్కృతి సంప్రదాయాలు, ఆధ్యాత్మికతపై అవగాహన పెంచేలా నెలరోజుల పాటు శ్లోకాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. హనుమాన్ చాలీసా, భగవద్గీతను బోధించడంతో పాటు వారు అనర్గళంగా శ్లోకాలు చదివేలా తర్ఫీదునిస్తున్నారు.

ముందు భయపడ్డా



రామాలయంలో నిర్వహిస్తున్న హనుమాన్ చాలీసా, శ్లోకాలపై శిక్షణ తరగతులకు రోజు హాజరవుతున్నా. శ్లోకాలు నేర్చుకోవడం అంటే ముందు భయమేసింది. కానీ నేర్పే విధానం మాలోని భయాన్ని పోగొట్టింది. చాలా సులువుగా నేర్చుకుంటున్నాం. అనర్గళంగా శ్లోకాలు చదివేలా నేర్చుకుంటున్నాం.

– లిఖిత, గంభీరావుపేట

ఆసక్తి చూపుతున్నారు



హనుమాన్ చాలీసా, శ్లోకాలు నేర్చుకోవడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం చాలా మంది చిన్నారులు సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడేందుకు, గ్రౌండ్‌లో ఆడుకోవడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతారు. కానీ ఆధ్యాత్మికతపై దృష్టిపెట్టరు. వారిలో ఆధ్యాత్మిక చింతనను పెంచేలా ఈ శిక్షణను ప్రారంభించాం.

– సత్యం, శిక్షకుడు, గంభీరావుపేట

కోనరావుపేట: ఇళ్లలోంచి మురుగ నీరంతా తమ ఇంటి ముందు చేరడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి చెందిన గిరి మోహన్‌రెడ్డి వాపోతున్నాడు. వర్షానికి గ్రామంలోని రెండు కాలనీలకు చెందిన మురుగునీరు తమ ఇంటి వద్దకు చేరిందని, గత కొన్ని రోజులుగా ఇలాగే వస్తుందని తెలిపాడు. దీంతో దోమలు వ్యాపించి రోగాలబారిన పడే అవకాశం ఉందన్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని మోహన్‌రెడ్డి తెలిపాడు.



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
కవిత రెడ్డి, కార్యదర్శి : 8688709971

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఆలయ విస్తరణపై ఆందోళన వద్దు

- శృంగేరి పీఠాధిపతుల అనుమతుల మేరకు అభివృద్ధి
- స్పష్టం చేసిన ఈవో, స్థానాచార్యులు


మాట్లాడుతున్న ఈవో వినోద్‌రెడ్డి, స్థానాచార్యులు ఉమేశ్‌శర్మ, ప్రధాన అర్చకులు శరత్‌శర్మ, తదితరులు

వేములవాడ: రాజన్న ఆలయ విస్తరణపై భక్తులు, స్థానికులు ఆందోళన చెందొద్దని, జూన్ 15 నుంచి ఆలయాన్ని మూసివేస్తామన్న ప్రచారంలో వాస్తవం లేదని ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి, ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్‌శర్మ స్పష్టం చేశారు. ఆలయ ఓపెన్ స్లాబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. శృంగేరి పీఠాధిపతుల అనుమతుల మేరకే పనులు చేపడతామన్నారు. వైదిక బృందం, అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపిన తర్వాతనే భీమేశ్వరాలయంలో భక్తుల దర్శనాలను ప్రకటిస్తామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రచారాన్ని భక్తులు నమ్మొద్దని కోరారు. స్వామి వారి ఉత్సవ మూర్తులను భీమేశ్వరాలయంలోకి తీసుకెళ్లి మండపంలో ప్రతిష్ఠించిన తర్వాతనే భక్తులకు దర్శనాలు కల్పిస్తామని తెలిపారు. పూజలు, ఉత్సవాలపై ఎలాంటి అపోహలకు గురికావద్దన్నారు. ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి, ఈఈ రాజేశ్ ఉన్నారు.

అభివృద్ధికి సహకరించండి

ఆలయ విస్తరణ, పట్టణాభివృద్ధిపై ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందించాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ కోరారు. కోరుట్ల బస్టాండు నుంచి తిప్పాపూర్ బస్టాండు వరకు మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న దుకాణాల యజమానులకు విన్నవించారు. వేములవాడ అభివృద్ధిని ఆకాంక్షించే వారు బంద్‌కు సహకరించొద్దని, యథావిధిగా షాపులు తీసుకోవాలి కోరారు. ఆలయ అభివృద్ధిని ఓర్వలేకనే బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఆడుతున్న నాటకాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

అనర్హులకు పదవి ఎలా ఇస్తారు ?



మాట్లాడుతున్న సిరస్వాల్ కైలాష్

సిరిసిల్లటౌన్: పట్టణ అధ్యక్ష పదవిని అనర్హులకు ఎలా ఇస్తారని బీజేపీ ఆపార్టీ ప్రధాన కార్యదర్శి సిరస్వాల్ కైలాష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అభివృద్ధికోసం కష్టపడుతున్న నాయకులను పక్కనబెట్టడం సరికాదన్నారు. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలంటే నియామకంపై పునరాలోచించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎనెగంటి నరేశ్, మహేశుని అనిల్, దీకొండ మహేందర్, కోడం బాలకిషన్, బొడ్డు సురేశ్, దూడం సురేశ్, దొంతరవేని మనోజ్ గౌడ్, వాసాల రాజశేఖర్, లాహోరే విక్రం, భాను, అనిల్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

'సేన' పేరుతో ప్రజలను తప్పదోవ పట్టించొద్దు


మాట్లాడుతున్న యెల్ల బాల్‌రెడ్డి

ముస్తాబాద్: బీఆర్ఎస్ ప్రజల్లో ఆదరణ కోల్పోవడంతో ఆపార్టీ నాయకులు కొంతమంది కేటీఆర్ సేన పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పూటకో పార్టీ మారే వారు కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, ఉచిత బస్ వంటి పథకాలు అమలు చేయడం ఇష్టంలేని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఉపసర్పంచ్ సారగొండ రాంరెడ్డి, అంజనేయులు, వుచ్చిడి బాల్‌రెడ్డి, శీల ప్రశాంత్, భాను, లక్ష్మారెడ్డి, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్ విద్యుత్ బిల్లు రూ.6.59 లక్షలు

సిరిసిల్ల: విద్యుత్ మీటరులో సాంకేతిక సమస్యల కారణంగా పట్టణంలోని రెస్టారెంట్‌కు దుర్గా ఫ్యామిలీ రెస్టారెంట్ యజమాని జిందం మహేందర్ మీటర్ సర్వీసు నంబర్ 10101-33153 సిరిసిల్ల టౌన్-2లో కేటగిరి-2 విద్యుత్ కనెక్షన్ పొందారు. బార్ అండ్ రెస్టారెంట్‌కు విద్యుత్‌ను వినియోగించుకున్నారు. 2024 సెప్టెంబర్ 4న విద్యుత్ మీటరును తనిఖీ చేయగా సాంకేతిక సమస్యలతో పని చేయడం లేదని ×సెస్₹ అధికారులు గుర్తించారు. ఈ మేరకు రెస్టారెంట్‌లో వినియోగించిన విద్యుత్ లైన్‌లాస్‌ను రికార్డు చేసి 15నెలల విద్యుత్ బ్యాక్ బిల్లింగ్ రూ.6,59,556 చెల్లించాలని కోరుతూ రెస్టారెంట్ యజమాని జిందం మహేందర్‌కు సెస్ అధికారులు నోటీసులు జారీ చేశారు. 6,235 యూనిట్ల విద్యుత్ రీడింగ్ నమోదు కాగా. ఈ మేరకు విద్యుత్ లైన్‌లాస్‌ను బ్యాక్ బిల్లింగ్‌గా నిర్ధారిస్తూ రూ.6.59 లక్షలు విధించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



కోనరావుపేట: గ్రామాల్లో విద్యుత్ సంబంధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి అన్నారు. మంగళవారం మండలంలోని మల్కపేటలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సెస్ ఏఈ దివ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, గ్రామ రైతులు పుట్టయ్య, పర్శరాములు, శ్రీనివాస్, పోశమలయ్య, దేవయ్య, సెస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుకకు అనుమతులు ఇవ్వాలి

ఎల్లారెడ్డిపేట: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి ఇసుక అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి కోరారు. ఎల్లారెడ్డిపేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఉన్నా ఇసుక దొరకక నిర్మాణ పనులు ముందుకుసాగడం లేదన్నారు. మండలంలోని వెంకటాపూర్, పదిర, నారాయణపూర్ గ్రామాల్లోని ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఇసుక తరలింపు విషయంలో వెసులుబాటు కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు, నాయకులు పందిర్ల లింగంగౌడ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, వంగ మల్లారెడ్డి, రాములు, బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, రవీందర్, రాజేందర్, గణపతి, తిరుపతిరెడ్డి, రామచంద్రం, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గత పదేళ్ల పాలనలో ఇసుక దోపిడీ విపరీతంగా జరిగిందని, ప్రస్తుతం అలా జరగకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకే ఇసుక అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పేద ప్రజల సొంతింటి కల సాకారమయ్యేలా ఇసుకను అందుబాటులో ఉంచాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు గంగిస్వామి, రాజశేఖర్, శంకర్, ప్రభాకర్, బాల్‌రెడ్డి, సురేశ్, అంజాగౌడ్, మోహన్‌నాయక్, బాబు, వంశీ, అజ్మీర భాస్కర్, లక్ష్మీనారాయణ, నల్ల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టాక్స్ పాలసీ తీసుకురావాలి

తంగళ్లపల్లి: ఇసుక అనుమతులకు పెద్దపల్లి జిల్లాలో అమలవుతున్న ఇసుక టాక్స్ పాలసీని సిరిసిల్లలో కూడా అమలు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా టోని మాట్లాడుతూ సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండేవిధంగా ఇసుక పాలసీని తీసుకురావాలన్నారు. ఇందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి చొరవచూపాలన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● బియ్యం పంపిణీ చేయండి

తంగళ్లపల్లి: సన్నబియ్యం పంపిణీ చేయడం లేదని, మే నెలలో 13 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు రేషన్ దుకాణానికి బియ్యం చేరలేదని అంకుషాపూర్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రేషన్ దుకాణం ఎదుట బైఠాయించి ప్రభుత్వం వెంటనే సన్నబియ్యం అందజేయాలని డిమాండ్ చేశారు.

● దరఖాస్తుల ఆహ్వానం

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, శ్రీవెంకటేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత టైలరింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నిర్వాహకులు సునీత తెలిపారు. ఇప్పటికే ఒక బ్యాచ్ శిక్షణను పూర్తి చేసుకుందన్నారు. మండలంలోని 18-40 ఏళ్ల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 18న శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

● జీలుగ విత్తనాలు అందించాలి

ముస్తాబాద్: ఖరీఫ్ సీజన్ పనులు త్వరలో ప్రారంభం అవుతుండగా వ్యవసాయ శాఖ ఇప్పటివరకు జీలుగ విత్తనాలను అందించడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ అన్నారు. పొరుగు జిల్లాల్లో జీలుగ విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందిస్తుండగా, మండలంలో ఇప్పటివరకు ఊసేలేదన్నారు. జీలుగ పచ్చిరొట్ట విత్తనాలను వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

● ఉనుక లారీకి అగ్ని ప్రమాదం

తంగళ్లపల్లి: ఉనుక తరలిస్తున్న లారీ అగ్నిప్రమాదానికి గురైంది. మండలంలోని జిల్లెల్ల శివారులో ఉనుకను తీసుకెళ్తున్న లారీ అధికలోడుతో వెళ్తుండగా పైన విద్యుత్ తీగలకు తగిలి మంటలు అంటుకున్నాయి. భయాందోళనకు గురైన లారీ డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

● అభివృద్ధి పనులపై ప్రజావేదిక

వీర్నపల్లి: మండలంలోని 17 పంచాయతీల్లో జరిగిన సుమారు రూ.4 కోట్ల విలువైన పనులపై సామాజిక తనిఖీ బృందం డ్వామా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ శేషాద్రి అధ్యక్షతన మంగళవారం రైతు వేదికలో ఎంపీడీవో వాజిద్ ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించారు. పనుల్లో జరిగిన అక్రమాలపై సంబంధిత ఉపాధి సిబ్బంది నుంచి సుమారు రూ. 21 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఏపీవో శ్రీహరి, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, ఎస్ఆర్పీ బాలు నాయక్, బీఆర్పీ రవి కుమార్, పీఆర్ఏఈ అనిల్, క్యాసి నవీన్ కుమార్, సోషల్ ఆడిట్ అంబుల్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

● దరఖాస్తుల స్వీకరణ

తంగళ్లపల్లి: భూదార్ కార్డులకు రైతుల నుంచి స్పందన లభిస్తోంది. మండలంలోని బద్దెనపల్లి వ్యవసాయ క్లస్టర్‌లో మంగళవారం వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ ఆధ్వర్యంలో భూదార్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. కాగా రైతులు పాస్ బుక్‌లు, ఆధార్ కార్డులతో వచ్చి భూదార్ కార్డులు ఆన్‌లైన్ చేసుకున్నారు. కార్యక్రమంలో బద్దెనపల్లి, బస్వాపూర్, రామన్నపల్లె, బాలమల్లుపల్లె రైతులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పెద్ద లింగాపూర్ రైతువేదికలో మంగళవారం క్లస్టర్ ఏఈవో జ్యోతి ఫార్మర్ ఐడీ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఏడు వ్యవసాయ క్లస్టర్లలో వ్యవసాయ విస్తరణ అధికారులు కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సురేష్ రెడ్డి తెలిపారు

● విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

ఇల్లంతకుంట: మద్యంమత్తులో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. మండలంలోని నర్సక్కపేట గ్రామానికి చెందిన బొల్ల బాల్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మద్యంమత్తులో పోలీసు విధులకు ఆటంకం కలిగించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇతనిపై ఇదివరకే మూడు కేసులు ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి


బోయినపల్లి: సమ్మె నోటీస్ ఇస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా చేపడుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. మంగళవారం సిరిసిల్ల లేబర్ అడ్డాపై పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పట్టణ భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొనాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: బీజేపీ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను తీసుకువచ్చి వారి హక్కులను కాలరాస్తుందని, కొత్తగా తెచ్చిన చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్లను మంగళవారం మండలంలోని రాచర్లగొల్లపల్లిలో కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. హమాలీ సంఘం మండల అధ్యక్షుడు గొర్రె మల్లేశం, పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు నారాపురం నర్సయ్య, నాయకులు ఎల్లయ్య, దాసారం సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ చార్‌బాయ్ బీడీ కంపనీ యాజమాన్యానికి బీడీ ప్యాకింగ్ కార్మికులు ఈ నెల 20న సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొననున్నట్లు మంగళవారం సమ్మె నోటీస్ అందజేశారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కన్వీనర్ గురజాల శ్రీధర్, బీడీ ప్యాకింగ్ కార్మికులు అంజయ్య, భాస్కర్, సత్యం తదితరులు ఉన్నారు.

స్వర్ణకారుల శాంతి ర్యాలీ

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో కార్పొరేట్ జువెల్లరీ దుకాణాలకు అనుమతులు ఇవొద్దంటూ స్వర్ణకారులు మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. బ్రహ్మంగారి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడు చింతోజు బాలయ్య మాట్లాడుతూ... ముస్తాబాద్‌లో రాజస్తాన్‌కు చెందిన వ్యాపారులు జువెలరీ దుకాణం పెట్టడాన్ని నిరసిస్తూ 12 రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టామన్నారు. అయినా జువెలరీ దుకాణం పనులు కొనసాగుతున్నాయన్నారు. సంఘం నాయకులు చేపూరి శ్రీనివాస్, బ్రహ్మం, జగన్నాథం, అనిల్, రఘు, వెంగళం శ్రీను, సత్యనారాయణ, రాజు, రమణ, హన్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలకు ముస్తాబు


సింగారం గ్రామ శివారులోని దర్మావలి గుట్ట


ముస్తాబైన దుర్వేషావలి దర్గా

- నేడు ఉత్సవాలు ప్రారంభం
- హాజరుకానున్న 2వేల మంది భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

ఎల్లారెడ్డిపేట: చుట్టూ పచ్చని పొలాలు.. పిట్టల కిలకిల రావాలు.. చెంతనే పారే పారేటివాగు జలసవ్వడులతో దర్మావలిగుట్ట ప్రాంతం ప్రకృతి అందాలతో విరాజిల్లుతోంది. దట్టమైన అడవిలో ఉన్న దర్మావలిగుట్టపై వెలసిన దుర్వేషావలి దర్గాకు శతాబ్దాల చరిత్ర ఉంది. ఎల్లారెడ్డిపేటకు చెందిన షేక్ అజీజ్ బాయి దర్మావలిగుట్టపై వెలసిన దుర్వేషావలి ఉర్సు ఉత్సవాలు ఏటా నిర్వహిస్తూ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. బుధవారం ఉర్సు ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా దర్మావలి గుట్టపై ప్రత్యేక కథనం..

ఆకట్టుకునే ప్రకృతి అందాలు..

మండలంలోని సింగారం గ్రామ శివారులోని దర్మావలిగుట్ట దట్టమైన అటవీప్రాంతంలో ఉంది. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న గుట్టపై ఉన్న దుర్వేషావలి ఉర్సు ఉత్సవాలు బుధవారం ప్రారంభమవుతున్నాయి. ఈ వేడుకలకు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ ముస్లిం మత గురువులు హాజరవుతారు. ఈనెల 14, 15 తేదీల్లో రెండ్రోజులు దర్మావలి గుట్టపై పండుగ వాతావరణం కనిపిస్తుంది.

ఇవీ కార్యక్రమాలు ..

- బుధవారం ఉదయం ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో చందల్ ఊరేగింపు నిర్వహిస్తారు.

– చందల్ ఊరేగింపు సందర్భంగా గుర్రాల బండ్లు, కళాకారుల నృత్యాలు ఆకట్టుకుంటాయి.

- చందల్‌ను ఎల్లారెడ్డిపేట నుంచి సింగారం గ్రామం వరకు ఊరేగింపుగా తీసుకెళ్తారు.
- దర్మావలిగుట్టపై వెలసిన దుర్వేషావలికి చందల్ సమర్పిస్తారు. మత గురువుల ప్రార్థనలు ఉంటాయి.
- మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భక్తులకు అన్నదానం.
- రాత్రి 8 గంటల నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ముంబై నుంచి వచ్చిన కవ్వాలి బృందం ప్రదర్శనలు ఉంటాయి.
- కార్యక్రమానికి అయ్యే మొత్తం ఖర్చు నిర్వాహకులు అజీజ్‌బాయి భరిస్తారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



దర్మావలి గుట్టపై ఏటా అందరి సహకారంతో ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. అల్లా ఆశీస్సులతో అందరూ సుభిక్షంగా ఉండాలని మత గురువులతో ప్రత్యేక ప్రార్థనలు చేయిస్తాం. అల్లా దీవెనలు అందరిపై ఉంటాయి. రెండ్రోజుల పండుగకు అన్ని ఏర్పాట్లు చేశాం.

– అజీజ్‌బాయి, ఉత్సవ నిర్వాహకుడు

షార్ట్ సర్క్యూట్

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు మంటలనార్పివేసేందుకు యత్నించారు. సెస్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది.